

ఆశా కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ మిషన్ వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ, సాధారణ వ్యాధులతో పాటు మధుమేహం వ్యాధిపై అందించాల్సిన వైద్య సేవలపై ఆశ కార్యకర్తలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పూర్తిగా అవగాహన పరుచుకుని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కిల్లోగుడ వైద్యాధికారి గౌతమ్, డుంబ్రిగూడ వైద్యాధికారి పి రాంబాబు, వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

మైనింగ్ జోలికొస్తే తరిమికొడతాం

మైనింగ్‌కి వ్యతిరేక సభలో సిపిఎం నేతలు అధిక సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: దాబుగూడ క్వార్జ్ మైనింగ్ తవ్వకాలకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని, మైనింగ్ జోలికొస్తే తరిమి కొడతామని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు హెచ్చరించారు. బుధవారం అరకులోయ మండలం మాదల పంచాయతీ దాబుగూడ గ్రామంలో సిపిఎం, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మైనింగ్‌కి వ్యతిరేకంగా సభ నిర్వహించారు. ఈ సభకు దాబుగుడ, దోమలజోరు, రక్తకండి, తోటవలస వివిధ గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, ఆదివాసీల మనుగడను దెబ్బ తీసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని మైనింగ్ తవ్వకాలు చేస్తే సహించేది లేదన్నారు. మైనింగ్ మాఫియాలను తరిమి కొడతామని హెచ్చరించారు. 2019 సంవత్సరంలో మైనింగ్ తవ్వకాలు చేయాలని దొంగ సంతకాలు చేయించి మైనింగ్ తీయాలని ప్రయత్నం చేశారని పోరాటం చేయడంతో వెనక్కి తగ్గారన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనింగ్ తవ్వకాలు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పేసా చట్టం,1/70 చట్టం ధిక్కరించి గ్రామసభ నిర్వహించకుండా చుట్టుపక్క ప్రజలను తెలియజేయకుండా దొంగ సంతకాలు చేయించి మైనింగ్ తీయాలని ప్రయత్నం చేస్తే ప్రజా తిరుగుబాటు తప్పదన్నారు. 9 ఎకరాలు భూమి విస్తరించి ఉన్న క్వార్జ్ మైనింగ్‌తో దాబుగుడ, తోటవలస, రత్తగూడ, పొట్టంగి పాడు, సరుబెడ్డ, రక్తకండి, దోమలజోరు, తుంగగడ్డ ఊటలో గెడ్డనీరు ఇంకిపోయి ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. దుమ్ము ధూళితో మూగ జీవులు మనుషులు కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉందన్నారు. కాపి తోటలు, మిరియాలు పంట పొలాలు పచ్చని అడవి నాశనమైపోతుందని ,పర్యావరణం నాశనం అవుతుందన్నారు. చిట్టంగొంది, మజ్జివలస పరిధి నుండి మంచినీరు ఒరిస్సా సరిహద్దు గ్రామాలైన సాపర్లై, అంపవల్లి పాచ్చిపెంట రిజర్వ్ డ్యాంము ఈ మంచినీరు ప్రవేశిస్తుందని, దీంతో తాగునీరు కాలుష్యమయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి దాబుగూడ క్వార్జ్ మైనింగ్ తవ్వకాలు ఆపాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు పి రామన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాచిపెంట చిన్నస్వామి, పంచాయతీ కార్యదర్శి కె రమేష్, మాదల పంచాయతీ అధ్యక్షులు అప్పన్న, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కే గోపాలు, సీతాన్న, మాజీ వార్డు సభ్యులు ఎస్.సొన్ను, పి.రామ్, టి పొట్టి, గురుమూర్తి, ఎస్ కొమ్ములు, కె కొములు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు



సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిమ్మలపాలెం చెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, బోలగొండ గ్రామ సచివాలయాన్ని బుధవారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా వాడపల్లి పిహెచ్‌సిని పరిశీలించి ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ వ్యాధులు ప్రబలకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం నిమ్మలపాలెం చెరువు పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని సూచించారు. బోలగొండ గ్రామ సచివాలయాన్ని పరిశీలించి ఏయే సేవలు అందుతున్నదీ ఆరా తీశారు.

పివిటిజిల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: పివిటిజిల అభివృద్ధికి పీఎం జన్ మన్ గృహాల నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస డిమాండ్ చేశారు. మండలంలోని సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశాని మండల అధ్యక్షుడు పాంగి భీమరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస మాట్లాడుతూ, , అత్యంత వెనుక బడిన పివిటిజి ల అభివృది కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్ మన్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. అల్లూరి జిల్లాలో సుమారు 25 వేల పివిటీజి కుటుంబాలకు ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయని, నిర్మాణ ఖర్చులు పెరిగిందన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న పివిటిజిల గృహ నిర్మాణానికి 2.లక్షల 39 వేలు చాలదన్నారు. ఇల్లు నిర్మాణానికి 5 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.పివిటిజిలు 52 శాతం కన్నా ఎక్కువగా ముంచంగిపుట్టు మండలంలో ఉన్నారని తెలిపారు.రోడ్డు, సామాజిక భవనాలు, తాగు నీరు, విద్య వంటి అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం చిత్తుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మండలంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి ప్రభావిత ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి పేరుతో అమాయక ఆదివాసులను చిత్ర హింసలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.ఆదివాసీ రిజర్వేషన్ చట్ట బద్ధత తర్వాతే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, లేకుంటే ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.పార్టీ జిల్లా మహా సభ డిసెంబర్ 4,5న పాడేరులో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.త్రినాధ్, ఎంఎం శ్రీను, నారాయణ, శంకర్, లైకోన్ పాల్గొన్నారు.



గిరిజనుల భూములపై కోర్టును ఆశ్రయించడం అన్యాయం

జడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 5వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం పరిధిలో గిరిజనులకు పూర్తి సర్వాధికారాలు ఉన్నప్పటికీ విజయనగరం రాజులు అనంతగిరి ప్రాంతంలో గిరిజనులు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వలేదని సుప్రీంకోర్టును ఆశ్రయించడం దారుణమని అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు అన్నారు. అనంతగిరి మండలంలోని గిరిజనులకు విజయనగరం రాజులకు మధ్య వివాదాస్పద భూముల విషయంలో అల్లూరి జిల్లా పాడేరు సివిల్ సెటిల్మెంట్ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల సాగులో ఉన్న భూములను విజయగనగరం రాజులు కొంతమంది తమవి అంటూ సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్నారు.ఆ భూముల వ్యవహారంపై హైకోర్టు పాడేరు సివిల్ సెటిల్మెంట్ కోర్టుకు రిఫర్ చేయగా గిరిజనుల తరుపున గిరిజన చట్టాలు, హక్కులుపై సీనియర్ అడ్వకేట్ పల్లా త్రినాధరావు వాదనలు వినిపించారని తెలిపారు. విజయనగరం రాజులు భూములను అప్పజెప్పాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిని కోరడంతో రైతులతో కలిసి హైకోర్టును ఆశ్రయించడంతో గిరిజనుల వాదనలు విన్న హైకోర్టు పాడేరు సివిల్ సెటిల్మెంట్ కోర్టుకు బదలాయింపు చేసిందని గంగరాజు వివరించారు. ఇరువర్గాల వాదనాలు విన్న జడ్జి ఐటిడిఎ పిఓ వి.అభిషేక్ తీర్పును రిజర్వ్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, మాజీ సర్పంచ్ దొన్ను, వార్డు మెంబర్ లక్ష్మణరావు నాగులు, గుండు, రాజు, సుబ్బారావు,రాజుకుమార్, ఆనంద్, జగనాధం, గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగరాజు

విద్యార్థులకు ఆట వస్తువుల వితరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సాగర పంచాయతీ ఆడపవలస ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరి విద్యార్థులకు ఆ గ్రామంలోని నేవి ఉద్యోగి బి.అనిల్ కుమార్ ఆట వస్తువలను బుధవారం వితరణ చేశారు. ముంబైలోని ఇండియన్ నేవి ఉద్యోగిగా ఆయన పని చేస్తున్నారు. ఇటీవల సొంత గ్రామానికి చేరుకున్న ఆయన చిన్నారుల కష్టాలను తెలుసుకున్న ఆయన ఆట వస్తువులను వితరణ చేశారు. ఆట, పాట, చదువుల్లో చిన్నారులు రాణించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. వీటిని అందజేయడంపై అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు రాం ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆట వస్తువులు ఇస్తున్న నేవీ ఉద్యోగి



విద్యుత్ స్టేషన్‌లో లోపాలను సరిదిద్దుతున్న కార్మికులు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రం స్విచ్ యార్డ్‌లో 33 కేవి కరెంటు ట్రాన్స్ఫార్మర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి మంగళవారం రాత్రి ఒంటిగంట నుంచి బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు గురయ్యారు. లోపాలును ఏపీ జెన్కో ఇంజనీర్లు పరిశీలించి సిటి కాలిపోయినట్లు గుర్తించారు. ఇంజనీర్లు, ఏపీ జెన్కో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు యుద్ధ ప్రాతిపదికన లోపాలు సవరించి బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సుమారు13 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఏపీ జెన్కో కార్యాలయాలు, బ్యాంకు, పాఠశాలల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సెల్ సేవలు నిలిచిపోయాయి.

నీటిని పొదుపుగా వాడాలి


ప్రజాశక్తి-చింతపల్లి: జల ఉత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, నీటిని పొదుపుగా వాడాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. స్థానిక ఈవోపిఆర్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన జల ఉత్సవం ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల ఉత్సవం కార్యక్రమంలో భాగంగా నీటిని పొదుపుగా వాడటంతో భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల శాఖ డిఈ రుక్మేంద్రరావు, పంచాయతీరాజ్ జేఈ బాలకిషోర్, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, సచివాలయ సిబ్బంది, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు, సిబ్బంది

అనంతగిరి: మండలంలోని ప్రతి గ్రామంలో నీటి వనరుల సంరక్షణ పై అవగాహన ర్యాలీని మండల కేంద్రంలో ఎంపిడిఓ ఎవివి.కుమార్ ఆద్వర్యాన జరిగింది. ఈ ర్యాలీ మూడు రోడ్లు కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలు అడుగంటిపోతే భవిష్యత్తు లో తీవ్రమైన నీటి కొరత ఏర్పడుతుందన్నారు. నీటి వనరులను వృథా చేయకుండా వాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్క పై ఉందన్నారు. ఈ ర్యాలీలో సర్పంచ్ సోమ్మెల. రూతు, జేఈ గౌతమ్, వెలుగు ఏపిఎం భద్రం, ఏపిఓ సన్యాసి, పంచాయితీ కార్యదర్శి .దేవ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంధ్య పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ప్రతి నీటిబొట్టును పొదుపుగా వాడాలని ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి సభ్యురాలు జానకమ్మ చెప్పారు. మండల కేంద్రంలోని కేజీబీవి, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జల సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞను చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, పచ్చదనంతో పాటు నీటి సంరక్షణకు తోడ్పాటునివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఏపీవో సూరిబాబు, సర్పంచ్ వెంకటరావు, మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న సర్పంచులు

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రం నుండి చీకుమద్దుల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని టీడీపీ సర్పంచులు ఆర్టీసీ డిఎంను కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు మాట్లాడుతూ, మారుమూల పంచాయతీ చీకుమద్దుల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. చీకుమద్దులతో పాటు సుమారుగా ఆరు పంచాయతీ ప్రజలు బస్సు సౌకర్యం లేక మండల కేంద్రానికి రావడానికి అనేక ఇబ్బందులకు పడుతున్నారని, ప్రైవేట్ వాహనాలకు రవాణా చార్జీలు పెరగడంతో అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ప్రవేట్ వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రయాణికులు పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ శశి భూషణం నాయుడు, చీకుమద్దుల సర్పంచ్ బొంజన్న దొర, గన్నేరుపుట్టు సర్పంచ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఎం మండల మహాసభలో జిల్లా నేత చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-సీలేరు

జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, 1/70, పీసా, ఇతర గిరిజన చట్టాలు పరిరక్షణకు పోరాటాలకు గిరిజనులు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. సిపిఎం జీకే వీధి మండలం ఏడవ మహాసభ సిరిబాల పంచాయతీ మునగరపల్లి గ్రామంలో జరిగింది. ముందుగా సిపిఎం జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు చంటిబాబు, సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మహాసభలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 100శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలన్న జిఓ నెంబర్ 3ని సుప్రీం కోర్టు రద్దు చేసి నాలుగేళ్లు దాటినా దాని పునరుద్ధరణకు నేటికీ ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయులుగా మేఘాలయ, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల వారు నియమితులయ్యారని తెలిపారు. కేజీబీవీ, ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు గిరిజనులకు ఏమి లేవన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే డీఎస్సీలో గిరిజనులకు ఎన్ని పోస్టులు ఇస్తారో స్పష్టత లేదని పేర్కొన్నారు. గిరిజన స్పెషల్ డిఎస్సి ద్వారానే ఆదివాసీ యువతకు న్యాయం జరుగుతుందన్నారు.

ఏజెన్సీలో 1/70 చట్టం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. మండల కేంద్రంలో అక్రమ కట్టడాలు కడుతున్నా చట్టాలు కాపాడవలసిన అధికారులు వారికి చుట్టాలుగా మారిపోయారని మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో పీసా గ్రామ సభలకు ఉన్న అధికారాలు అమలు కావడం లేదని, గ్రామసభల తీర్మానాలు లేకుండానే ఏజెన్సీలో అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. చింతపల్లి మండలం తెరపల్లి గ్రానైట్ క్వారీ అక్రమంగా సాగుతోందన్నారు. ఇప్పుడు జీకే వీధి మండలం రొంపుల పంచాయతీ చాపరాతి పాలెం ఎర్రమట్టిని అక్రమంగా తరలించడానికి అంతా సిద్ధం చేస్తున్నారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు కూడా పీలా గ్రామసభలను ఉల్లంఘించి తీర్మానాలు చేశారని తెలిపారు.



జెండా ఆవిష్కరణ అనంతరం సెల్యూట్ చేస్తున్న సిపిఎం నాయకులు, సభ్యులు

సిపిఎం మండల కార్యదర్శిగా బుజ్జిబాబు ఎన్నిక

ఈ మండల మహాసభలో సిపిఎం మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా సభ్యులందరూ చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం సిపిఎం మండల నూతన కమిటీ ఎన్నికైంది. పార్టీ మండల కార్యదర్శిగా అంపరంగి బుజ్జిబాబు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా జి.సత్యనారాయణ, చంటిబాబు, బాలయ్య, కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు కేశవ, రామారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మిడ్డేమీల్స్, శానిటేషన్ వర్కర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు కొమరం పెంటయ్య మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మిడ్డేమీల్స్ పథకానికి బిల్లులు చెల్లించలేదని, తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. రెండు నెలల నుండి బియ్యం అందడం లేదని, జీతాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూమిటీ ప్రభుత్వం 25 సంవత్సరాల నుండి పని చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తుందని, అది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ కూడా అధికార పార్టీకి చెందిన వారినే పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై చొరవ చూపి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమీల్స్, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బిఐ అధికారులు

ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

భారతీయ స్టేట్ బ్యాంకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలని గంగవరం ఎస్‌బిఐ మేనేజర్ జగదీష్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌బిఐలో మంగళవారం వినియోగదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్టేట్ బ్యాంక్ అందిస్తున్న సేవలను వివరించారు. దేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్ తమ కస్టమర్లకు బ్యాంకులో అడుగు పెట్టకుండానే అనేక సేవలను ఆన్లైన్ ద్వారా మొబైల్ బ్యాంకింగ్ ద్వారా అందించడం జరుగుతుందని చెప్పారు. ఎస్‌బిలైలో పీఎంఎస్‌బివై, పిఎంజెజెబివై, పేయ్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ వంటి అనేక సౌకర్యాలను పొందవచ్చని పేర్కొన్నారు. ఎస్‌ఐపి ద్వారా అధిక మొత్తంలో వడ్డీ రేటును పొందవచ్చన్నారు. క్యాష్ ఆఫీసర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ వినియోగదారులు చిన్నచిన్న పనులకు సైతం బ్యాంకు వద్ద గంటలు తరబడి వేచి ఉండే కంటే ఎస్బిఐ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా బ్యాలెన్స్ ఎంక్వయిరీ మినీ స్టేట్మెంట్ వంటి సేవలను తమ మొబైల్‌లోనే పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ సిబ్బంది శ్రీవిద్య, సీఎస్పీ సిబ్బంది ఉషశ్రీ, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు గ్రామపంచాయతీ పరిధి కూటూరు, ముళ్లూరు, కూటూరుగట్టు గ్రామాలకు రోడ్లు నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. బడి పిల్లలకు సంబందించి మధ్యాహ్నం భోజనానికి బియ్యం ప్రతి నెల ఇవ్వాలని, వర్షాలు, వరదలు వల్ల నష్ట పోయిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. 2017-18లో మంజూరైన హౌసింగ్ కాలనీకి బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమం సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నూప రాజు, పద్దం రాజు, పాయం రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



ఐటిడిఎ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చి వస్తున్న సిపిఎం నాయకులు

మూడేళ్ల కాల పరిమితిని రద్దుచేయాలి

సిఐటియు ఆధ్వర్యాన విఒఎల ఆందోళన



దుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న విఒఎలు

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ:వెలుగు శాఖలో పని చేస్తున్న విఓఏల మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. మూడు రోడ్ల జంక్షన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పెట్రోల్ బంకు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్, శ్రీనివాసరావు, దేవి, జమున, బుచ్చిబాబు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమ వేధింపులు, తొలగింపులు ఆపాలని స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సిఐటియు మండల అధ్యక్షుడు కొర్ర శంకర్ ఆధ్వర్యంలో మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు సిఐటియు మండల పాంగి భీమరాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, కొర్ర త్రినాథ్, మండల అధ్యక్షుడు సొలగం గాసిరాం దొర సంపూర్ణ మద్దతు తెలిపారు. సిఐటియు మండల ఉపాధ్యక్షుడు పాంగి భీమరాజు మాట్లాడుతూ, ప్రతినెల వేతనాలు అందక చాలీ చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మొబైల్ యాప్ నిర్వహణకు రీఛార్జ్‌లు ప్రభుత్వం చెల్లించటం లేదని మండిపడ్డారు.గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గాసిరం ధర మాట్లాడుతూ, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు అపాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా పీడీ కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివో ఏల మండల అధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి రాజారావు వివోఏలు పాల్గొన్నారు.

హుకుంపేట:వెలుగు కార్యాలయం వద్ద విఓఏల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. కాల పరిమితి సర్కులర్‌తో గత 15 సంవత్సరాలుగా ఇదే ఉపాధి పై ఆధారపడి వివోఏల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వివోల తొలగింపు చేయడమే కాకుండా రాజకీయ వేధింపులు చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనేక జిల్లాల్లో వందలాది మంది తొలగిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ ఉపాధ్యక్షులు పోతురాజు, యూనియన్ నాయకులు లీల పద్మ, రత్నకుమారి, రమణ, మనీష్ కుమార్, సోమన్న, ఆనంద్, అప్పలరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



హుకుంపేటలో ధర్నా చేస్తున్న విఒఎలు


అరకులోయ రూరల్:విఒఎల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటియు ఆధ్వర్యంలో బుధవారం అరకులోయ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా విఒఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్బీ రాజ్ కుమార్ మాట్లాడుతూ, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.టిడిపి పార్టీ హామీ మేరకు ఈ సర్క్యులర్ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివోఏ సంఘం మండల నాయకులు కె జ్యోతి, పి ఆనంద్, ఎస్ సల్మాన్, ఎస్ మధు,తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో వెలుగు విఒఎలు ర్యాలీ, రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హమీలు తక్షణమే అమలు చేయాలన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూనియన్ ప్రతినిధులు ఎం.రంజిత, కె.దిలీప్ , జన్ని సింహాచలం, వసంత పాల్గొన్నారు

కొయ్యూరు:వెలుగు విఒఎ (యానిమేటర్స్)ల సమస్యలను పరిష్కరించాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, 8 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం తహశీల్దారు, ఎంపిడిఒ, ఎస్ఐ, వెలుగు ఎపిఒలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ వివోఏలకు నెలనెలా వేతనాలు రాక వారి కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు ధరలు పెరుగుతుంటే వేతనాలు పెంచకపోగా, అరకొర వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ నెల 7, 8 జరిగే నిరవధిక నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సూరిబాబు, వివోఏల నాయకులు, మల్లేశ్వరరావు, శాంతా కుమారి, చంటి, శోభన్ బాబు, భవాని పాల్గొన్నారు.



అరకులోయలో దీక్షలో కూర్చున్న విఒఎలు



కొయ్యూరులో వినతిపత్రాలు అందిస్తున్న విఒఎలు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు:మండల యుటిఎఫ్ అధ్యక్షులు సమరెడ్డి రాజు అధ్యక్షతన మండల మహాసభలు మంగళవారం రాత్రి స్థానిక శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా యుటిఎఫ్ జనరల్ సెక్రెటరీ వి.మహేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 17న అరకులోయలో జరిగే స్వర్ణోత్సవ జిల్లా కౌన్సిల్‌కు ఏఎస్ఆర్ జిల్లాలోని 22 మండలాల యుటిఎఫ్ కార్యవర్గ, సభ్యులు హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా నియమించారు. గౌరవ అధ్యక్షులుగా ఎం అప్పలనాయుడు, అధ్యక్షులుగా సమరెడ్డి. రాజు,ప్రధాన కార్యదర్శిగా సీసా గోపి, సహాధ్యక్షులుగా సిహెచ్ త్రినాథ్, పి. ఈశ్వరమ్మ, కోశాధికారిగా కూడ శ్రీనివాసమూర్తి, కార్యదర్శులుగా కే.కృష్ణ, కే.దాసయ్య, ఎల్. అవినాష్, దీప్తి, సురేష్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

ప్రజా ఫిర్యాదులపై అవగాహనుండాలి : జెసి

ప్రజాశక్తి - పాడేరు : ప్రజా ఫిర్యాదుల నిర్వహణ ప్రక్రియపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ సూచించారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా అధికారులకు మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ నిర్వహణపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. అర్జీలను ఆన్లైన్ నమోదు, ఎండార్స్‌మెంట్ వేయడం వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. జి. ఆర్. ఎస్. వెబ్సైట్లో నమోదు చేసిన ఫిర్యాదులను మూడు దశలలో ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. వెబ్సైట్‌ను ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అధికారులు పరిశీలించి ఫిర్యాదు తమ శాఖకు చెందినదా లేదా అని పరిశీలించి పరిష్కారం చేయాలని చెప్పారు. అర్జీలపై సక్రమంగా ఎండార్స్మెంట్ చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన తరువాత నిర్దేశించిన అధికారి అర్జీదారుని ఇంటికి వెళ్లి తప్పకుండా ఫోటో తీసుకుని వెబ్సైట్లో నమోదు చేయాలన్నారు. ఐటిడిఎ పిఒ అభిషేక్ మాట్లాడుతూ, నిర్దిష్టమైన గడువు లోపు ఫిర్యాదులు పరిష్కారం చేయాలన్నారు. ఆర్థిక పరమైన, ఆర్థికేతర సమస్యలు పరిష్కారం జరిగినప్పుడు ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. ఈ వర్క్‌షాపులో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ పద్మలత, ఎస్డిసి భవాని, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకరరావు, రంపచోడవరం భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, సిపిఓ ఎస్.ఎస్. ఆర్. కె.పట్నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జీ డి.డి. ఎల్.రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ విశ్వామిత్ర, సెరీ కల్చర్ ఎ.డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఆర్థిక చేయూత

నాబార్డ్ డిడిఎం చక్రధర్

ప్రజాశక్తి - చింతపల్లి: మన్యంలో సేంద్రియ విధానంలో పండిస్తున్న వివిధ రకాల పంటలను గిరిజన రైతులంతా సంఘాలు (ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ)గా ఏర్పడితే అధికంగా చేయూత అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నాబార్డు అల్లూరి జిల్లా అభివృద్ధి మేనేజర్ (డీడీఎం) రావూరి చక్రధర్ అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన లంబసింగి ఆర్గానిక్ ట్రైబల్ ప్రొడక్ట్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్ పీ ఓ)కు సంబంధించి వార్షిక సమావేశం బుధవారం నిర్వహించారు. ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, సభ్యులతో ఏర్పాటైన ఈ సమావేశానికి నాబార్డు డీడీఎం చక్రధర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ , గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు, వ్యక్తిగతంగా రైతులకు పలు రకాల ప్రోత్సహకాలు అందించేవారన్నారు. కాలక్రమంలో రైతు సంఘాలు (ఎఫ్ పీ ఓ)లను ప్రోత్సహిస్తు న్నామన్నారు. ఈ క్రమంలోనే తమ నాబార్డు ఇప్పటి వరకూ అల్లూరి జిల్లాలో 10 ఎఫ్ పీ ఓ లకు సుమారు రూ.4 కోట్ల వరకూ ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వరకూ ఎఫ్ పీ ఓలు ఉండగా అందులో పది సంఘాల వరకూ బాగా పనిచేస్తున్నాయన్నారు. లంబసింగి ఎఫ్ పీ ఓ వినూత్నంగా కాలాను గుణంగా మన్యంలో పండే పసుపు, అనాసపనస వంటి పంటల్లో వివిధ రకాల విలువ ఆధారిత నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి వాటిని ఎగుమతి చేస్తుందన్నారు. దీంతో స్థానికంగా రైతులకు మద్దతు ధరతో పాటు పలువురికి ఉపాధి కల్పతుందన్నారు. కాలానుగుణంగా మన్యంలో పండే పసుపు, అనస పనస వంటి పండ్ల తో వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి వాటిని ఎగుమతి చేస్తుందన్నారు. దీంతో స్థానికంగా రైతులకు మద్దతు ధరతో పాటు పలువురికి ఉపాధి కలుగుతుందన్నారు.మూడేళ్ల కాలంలో ఈ ఎఫ్ పీ ఓ రూ.1.42 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. వచ్చే ఏడాది నాటికి రూ.2 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించడం జరిగిందని అన్నారు. సేంద్రియ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలతో పాటు దూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నామని కిసాన్ నెస్ట్ సీఈఓ రాజేష్ తెలిపారు. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ తమ పరిశోధనా స్థానంలో ప్రయోగాత్మకంగా సాగుచేసిన వరి వంగడాలను రైతులు పరిశోధనా స్థానానికి వచ్చి పరిశీలించి అనువుగా ఉండే రకాలను సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు. సుగంధ ద్రవ్యపంటలసాగు చేసే రైతులు సంఘాలుగా ఏర్పడితే రాయితీలు కల్పిస్తామన్నారు. అధిక దిగుబడినిచ్చే మిరియాల మొక్కలను అభివృద్ధి చేసి వాటిని రైతులకు అందిస్తున్నామని, స్థానిక ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పీ ఓ చైర్మన్ ఉల్లి నూకరాజు, డైరెక్టర్లు ఇందిర, సరోజ, శోభారాణి, కన్నబాబు, ఐఐఎంఆర్ ప్రతినిధి శ్రీనివాస్, పెద వరుడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డ్ డిడిఎం చక్రధర్

కాఫీ కార్మికులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపిఎఫ్ డిసి ఒప్పంద కాఫీ కార్మికులకు తీవ్ర అన్యాయమని ఎఐటియుసి నాయకులు సత్యం అన్నారు. బుధవారం పాడేరులో విలేకరులతో మాట్లాడుతూ, కనీస వేతనం కంటే ఒప్పంద వేతనం తక్కువ చట్ట విరుద్ధమని తక్షణమే ఆ ఒప్పందం రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. కాఫీ కార్మికుల వేతనాలు పెంపు కోసం కాఫీ బోర్డు రెండుసార్లు చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ జీతానికి ఒప్పందం సరికాదన్నారు. ఈ విషయమై లేబర్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు అమర్, జల్లి రాజబాబు, బిమలమ్మ తెలిపారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెదబయలు:జిల్లా అంధత్వ నివారణ సంస్థ (పాడేరు), శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం పెదబయలు ప్రాథమిక కేంద్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా 88 మందికి పరీక్షలు నిర్వహించగా 8 మందికి శస్త్ర చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు వైద్యాధికారి నిఖిల్, గోమంగి వైద్యాధికారి కిరణ్, ఎంపిహెచ్ఇ వెంకటరావు పాల్గొన్నారు

గంజాయి కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని గంజాయి కేసులో ముగ్గురికి ఒక్కొక్క సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ 10000 జరిమానాను 9వ జిల్లా అదనపు చోడవరం జడ్జి కోర్టు బుధవారం తీర్పునిచ్చినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. వీరిలో వంతల సురేష్, వంతల సుబ్బు, సీసా సొన్నులకు శిక్ష పడిందన్నారు. వీరిలో జోలాపుట్టు , బరడ పంచాయతీ మరొకరు ఒరిస్సా రాష్ట్రానికి చిత్రకొండ పరిధి చెందిన వాసులుగా తెలిపారు. 2013 సంవత్సరంలో నమోదైన కేసులోని నిందితులు ముగ్గురికి పై తీర్పు వెల్లడించడం జరిగిందన్నారు.

కొత్త డిజైర్ ప్రీ-బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) నూతన డిజైర్ బుక్కింగ్స్ ను బుధవారం విశాఖలో ప్రారంభించింది. మద్దిలపాలెంలోని మారుతి సుజుకీ షోరూమ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ భారతదేశపు అత్యధికంగా విక్రయించబడే సిడాన్ వాహనం డిజైర్ నూతన డిజైన్‌తో వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. రూ.11 వేలు ప్రారంభపు చెల్లింపుతో www.marutisuzuki.com/dzire ద్వారా ప్రీ-బుక్ చేసుకోవాలని సూచించారు.

జలవిద్యుత్ కేంద్రం మొదటి యూనిట్‌లో లోపాలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మొదట యూనిట్ సర్క్యూట్లో లోపాలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి జాప్యం జరుగుతుందని ఏపీ జెన్కో ఈ ఈ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ యూనిట్ మరమ్మతులు సోమవారం సాయంత్రానికి పూర్తిచేసి సోమ, మంగళవారాల్లో స్పిన్నింగ్‌లో పెట్టి యూనిట్ పనితీరు పరిశీలించామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం యూనిట్ టెంపరేచర్ మేగ్గర్ వ్యాల్యూస్ అనుకున్న స్థాయిలో రాకపోవడంతో యూనిట్ పనితీరు పరిశీలించగా సర్క్యూట్ లోపాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇంజనీరింగ్ నిపుణులతో లోపాలు సరిచేసి మెకానికల్ స్పిన్నింగ్‌లో పెట్టి యూనిట్ కండిషన్ పరిశీలించడం జరిగిందన్నారు. బుధవారం సాయంత్రం వరకు స్పిన్నింగ్‌లో పెట్టి అనంతరం యూనిట్ శింకర్ నైజింగ్ చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని చెప్పారు. మొదటగా 10 మెగావాట్లు లోడ్ వేసి అనంతరం యూనిట్లో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకపోతే క్రమంగా 60 మెగావాట్లు వరకు విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి చర్యలు చేపడతామని తెలిపారు. మరో వైపు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ బ్రేకర్ ఎగ్జ్ లరీ స్విచ్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ ఉత్పత్తి మంగళవారం సాయంత్రం నుంచి నిలిచిపోయింది.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామంలోని గత నెల 31న దీపావళి రోజున కిరాణా షాపులో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడిన జి.సరస్వతి (55) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు తెలిపారు. దీపావళి రోజు దీపాలు వెలిగిస్తున్న నేపథ్యంలో షాపులో మంటలు వ్యాపించి సరస్వతి చీర అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల పరిషత్తు సమావేశం వాయిదా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరగవలసిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడినట్లు ఎంపీడీవో కార్యాలయ ఏఓ రత్నరాజు బుధవారం తెలిపారు. ఈనెల 6న మండల జనరల్ బాడీ సమావేశం ఉన్నట్లు ఎంపీడీవో లోకలు యాదగిరిశ్వరరావు ప్రకటించారు. దీంతో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీపీ, జడ్పీటీసీ సమావేశ మందిరానికి హాజరుకాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేయడం జరిగిందని ఏవో రత్నరాజు తెలిపారు.

రంప రోడ్డులో మద్యం దుకాణం వద్దు


ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నుండి రంప గ్రామానికి వెళ్లే మార్గం మధ్యలో నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేస్తున్నారని ప్రచారం జరుగుతుందని, అలా ఏర్పాటు చేస్తే ఆ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఆ రోడ్డులో రంప పర్యాటక ప్రదేశాన్ని వెళ్లే పర్యాటకులు, పాఠశాలలు, కళాశాలలు వెళ్లే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని వారు చెబుతున్నారు. ఈ విషయాన్ని గమనించి మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని రంప రోడ్డులోని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎర్రంపేటలో సీసీ రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంగా పరిపాలన అధికారుల కార్యాలయాలు ఉన్న ఎర్రంపేట గ్రామంలో అంతర్గత లింకు సీసీ రోడ్లు నిర్మించాలని, మురుగునీరు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి సిపిఎం గ్రామశాఖ మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం పాంద్రం నాగార్జున అధ్యక్షతన సిపిఎం గ్రామశాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ ఎర్రంపేట అంగన్వాడి సెంటర్ నుండి పాండు ముత్తయ్య గుంపు, తీగల రవి ఇంటి నుండి సర్పంచ్ గుంపుకు, మోటు ప్రధాన రహదారి నుండి ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్ వరకు, ఏ సెంటర్లో నైనా కూడా అంతర్ లింకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వల్లపు వెంకట్, మండల కమిటీ సభ్యులు పోడియం లక్ష్మణ్, స్థానిక నాయకులు పాంద్రం సుబ్బారావు, తేపల్లె లక్ష్మయ్య, శ్యామల తమ్మయ్య పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం :ఏజెన్సీలోని వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌యస్)కు వచ్చే అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన దరఖాస్తులను పరిష్కారంపై వివిధ శాఖల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ సింహాచలం మాట్లాడుతూ పిజిఆర్‌యస్‌కు వచ్చిన దరఖాస్తులు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, వాటిని 24 గంటల్లో సంబంధిత అధికారులు ఓపెన్ చేసి పరిశీలించాలని సూచించారు. దరఖాస్తులను ఆన్లైన్లో అప్లోడ్ చేసేటప్పుడు ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తు పరిష్కారం కానివి ఎందుకు పరిష్కరించబడలేదో దరఖాస్తుదారునికి ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ఒక్కసారి వచ్చిన సమస్యల దరఖాస్తులు రెండోసారి రాకుండా పరిష్కరించాలన్నారు. ప్రాజెక్ట్ మోనిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులు మన స్థాయిలో ఉన్న వాటిని మనమే పరిష్కరించాలని, ఇక్కడ పరిష్కారం కాని వాటిని జిల్లా కలెక్టర్ స్థాయిలో పరిష్కారం కొరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల శాసనమండలి సభ్యుల ఎన్నికలకు మోడల్ కండక్ట్ కోడ్ ఈనెల 5వ తేదీ నుండి అమలులోనికి వచ్చిందని,

ఎన్నికల నియమావళి పాటించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : త్వరలో శాసనమండలి ఎన్నికలు జగరనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ నియమావళిని అందరూ పాటించాలని ఎంపీడీవో తోతికి శ్రీనివాస్ విశ్వనాథ్ ఆదేశించారు. మండలంలోని సున్నంపాడు పంచాయతీని బుధవారం ఆయన సందర్శించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ఎన్నికల జరపాలంటే గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాజకీయ పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాల వ్యక్తులు ఎన్నికల కోడ్‌ని గౌరవించాలని కోరారు. మండలంలో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ కఠినంగా అమలు చేయాలన్నారు.



సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

వేతన బకాయి చెల్లించాలని 104 సిబ్బంది వినతి



డాక్టర్ మనోజ్ఞకు వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బందికి

ప్రజాశక్తి-కొయ్యూరు : 104 సిబ్బందికి 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్ము తిరిగి ఇప్పించాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్ఞకి 104 సిబ్బంది బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటామని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్ నాగ సురేంద్ర, మంతెన ఫణింద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం రేషన్ సరుకులు సరఫరా

ప్రజాశక్తి-అడ్డతీగల :మండలంలో రేషన్ సరుకులు 100 శాతం సరఫరా పూర్తి చేసినట్లు జిపిసిఎం సొసైటీ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. అడ్డతీగల ఎంఎల్ఎస్ గోదాము పరిధిలో ఉన్న అడ్డతీగల, గంగవరం, వై.రామవరం మండలాల్లోని 32 డిఆర్ డిపోలకు పిడిఎస్ బియ్యం, కందిపప్పు, పంచదార నూరు శాతం సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ తీసుకునే కార్డుదారులు ఈ విషయాన్ని గమనించి డిఆర్ డిపోల నుండి బియ్యం పంచదార కందిపప్పు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి -కొయ్యూరు :మండలంలోని పాత బాలారంలో నాగులపల్లి అర్జున్, కొండబాబు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల బుధవారం ఉదయం 11 గంటల సమయంలో దగ్ధమైంది. దీంతో రెండు కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. సర్పంచ్ అప్పన్న అప్పలనర్స బాధితులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు త్వరితగతినా అందేలా చూడాలని ఎమ్మార్వో, ఎంపీడీవోలను కోరారు.



తాటాకిల్లు దగ్ధంతో రోడ్డున పడ్డ బాధిత కుటుంబ సభ్యులు

తిరుమలకు కాలినడకన బయలుదేరిన భక్తుడు

ప్రజాశక్తి -సీలేరు:జీకే వీధి మండలం సీలేరుకు చెందిన కొర్ర గురుమూర్తి వెంకటేశ్వర స్వామి మాల ధరించి కాలినడకన తిరుమలకు బుధవారం బయలుదేరారు.గురుమూర్తి వెంకటేశ్వర స్వామి మాల ధరించి 45 రోజులు దీక్షా సమయం పూర్తయ్యే నాటికీ వెంకటేశ్వర స్వామి దర్శించుకోవాలని సంకల్పించారు. ఇందులో భాగంగా గురుమూర్తి దీక్ష చేపట్టి బుధవారం నాటికి 15 రోజులైంది. మరో 30 రోజులు కాలినడకన దీక్ష పూర్తిచేసి డిసెంబర్ 6న తిరుమల చేరుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తిరుమతి బయలుదేరిన సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్ నూకాలమ్మ ఆలయ ప్రధాన రహదారి వరకు నడిచివెళ్లి ఆయనకు సంఘీభావం తెలియజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-రంపచోడవరం :అగ్ని ప్రమాదాల నివారణపై రంపచోడవరం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని మాపక శాఖ అధికారులు ఎస్.గంగనదొర, కె.రామచంద్రరావు సిబ్బంది అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి అనే విషయాలపై తెలియజేశారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది కె.పోతురాజు, జె.వెంకటలక్ష్మి, ఎం.సామ్రాజ్యం, కె.బాపిరాజు, వి.సిద్ధార్థ, పి.లక్ష్మణరెడ్డి, కె. శ్రీముబాయి పాల్గొన్నారు.

రేపు ఏడు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం సబ్ స్టేషన్‌లో 220/33కెవి వార్షిక మరమ్మతులు, లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఈ నెల 8న శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏడు మండలాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిసిసి డివిజనల్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవీపట్నం : జిసిసిలో డ్రైవర్‌గా పని చేస్తున్న ముచ్చిక సాయిబాబు దొర హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందడానికి కారణమైన జిసిసి డివిజనల్ మేనేజర్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రంపచోడవరం మండలం, బందపల్లి గ్రామానికి చెందిన ముచ్చిక సాయిబాబా దొర రంపచోడవరం గిరిజన సహకార కార్పొరేషన్‌లో కొన్నేళ్లుగా కాంటాక్ట్ పద్ధతిలో డైలీ కూలీగా వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. సాయిబాబు దొరకు జిసిసి డిఎం ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా చట్ట విరుద్ధంగా డ్రైవర్ ఉద్యోగం నుండి తొలగించి, ఆయన స్థానంలో గిరిజనేతరుడిని నియమించారని తెలిపారు. తన ఉద్యోగం తనకు ఇప్పించాలని జిసిసి డిఎంకు, ఐటీడీఏ పీఓకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో సాయిబాబుదొర తీవ్ర మానసిక ఒత్తిడికి గురై హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.